# డబ్బుకొద్దీ ప్రేమ

– హనుమంతు అన్నంనాయుడు

ఖుర్దా రోడ్ డివిజన్‌లో అదో చిన్న రైల్వే స్టేషను. ఆ స్టేషను పేరు మందసా రోడ్. దానికి అధిపతి ఆనందరావు మాస్టారు. ఆయన్ని అక్కడి స్టాఫంతా అభిమానిస్తారు. అంతే కాదు ఆయనంటే భయమూ, భక్తీ రెండూ వున్నాయి. మచ్చలేని మంచి మనిషి. మితభాషి. రూల్స్‌ను తూ.చ. తప్పకుండా పాటించడంలో ఘనాపాటి. తన సర్వీసులో ఇంతవరకూ ఒక్క చార్జిషీటైనా తీసుకోలేదు.



తన మనసు లాగే ఎప్పుడూ స్వచ్ఛమైన మల్లె పూవు లాంటి తెల్లటి యూనిఫాం ధరిస్తాడు. తనెంత నీట్‌గా వుంటాడో స్టేషను ఆవరణను కూడా అంతే పరిశుభ్రంగా వుంచుతాడు. నక్స లైట్ల కోపతాపాలకు ఆ స్టేషను రెండు సార్లు బలైంది. రెండోసారి డైనమైట్లతో పేల్చి స్టేషను కాల్చివేసినప్పుడు, తను ఎంతో శ్రమించి నీట్‌గా వుంచుకున్న రికార్డులు సగం కాలి దర్శనమి స్తోంటే, బీటలువారి శిథిలమైన గోడల మధ్య తను అమితంగా అభిమానంచే గాంధీ తాత ఫోటో కిందపడి ముక్కలు చెక్కలైన గాజు పెంకుల మధ్య బోసి పెదాలతో ఏడవలేక నవ్వుతుంటే ఆ దృశ్యం చూసిన ఆనంద రావు మాస్టారు చిన్నపిల్లాడిలా ఏడ్చేశాడు. ఆ తరువాత తన పట్టుదలతో, అధికారుల సహ కారంతో తిరిగి పక్కా బిల్డింగ్ కట్టే వరకూ నిద్రపోలేదు.

ఎప్పటిలాగే ఆరోజు కూడా డ్యూటీకి వచ్చి చిన్న మాస్టారు దగ్గర ఛార్జి తీసుకున్నాడు. వచ్చీపోయే బళ్ళకు లైను క్లియరు ఇస్తున్నాడు కాని, మనసు మనసులో లేదు. ఏదో తడ బాటు! అనిర్వచనీయమైన భావోద్వేగం! దానికి కారణం ఆరోజు జూన్ ముప్ఫయ్! ప్రతి ఏడూ వచ్చే జూన్ ముప్ఫయ్‌కీ, ఈ జూన్ ముప్ఫయ్‌కీ ఓ ప్రత్యేకత వుంది. అదే ఆనందరావు మాస్టారు సర్వీసుకు చిట్టచివరి రోజు. అంటే జులై ఫస్టుకు రిటైరవుతాడన్నమాట!

తన సొంత వాళ్ళకన్నా మిన్నగా అభిమానించే ఈ మనుషుల్నీ, పరిసరాల్నీ వదిలి వెళ్ళిపోతు న్నాననే దిగులు ఒక పక్క అయితే, బంధ విముక్తి చెంది పంజరం విడిచిన పక్షిలా స్వేచ్ఛా వాయువులు పీల్చుకుంటూ, సొంత గూటికి చేరుకోబోతున్నాననే ఆనందం మరో పక్క అతని విధి నిర్వహణకు ఆటంకంగా నిలి చాయి. డ్యూటీకి వచ్చినప్పుడే తనతో తెచ్చుకున్న ఫ్లాస్కులోని వేడి వేడి కాఫీ తాగి కొంచెం స్థిమితపడ్డాడు. 'రేపు నాకు డ్యూటీ లేదు. రేప టితో నాకూ, ఈ స్టేషనుకీ సంబంధం లేదు' అన్న భావన ఆయన నరనరాల్లో ప్రవేశించి రక్త ప్రసరణను అధికం చేస్తోంది. అందుకే కాబోలు దేవుడు మానవుడికి ఇంత విజ్ఞానాన్ని ప్రసాదించినా, మరణాన్ని మాత్రం ముందుగా తెలుసుకోకుండా రహస్యంగా దాచి వుంచాడు.

భారంగా వున్న మనసుని తేలిక పర్చడానికి కుర్చీలోంచి లేచి బయటకు వచ్చారు. స్టేషను ఆవరణలో తాను ఎంతో శ్రమతో తీర్చిదిద్దిన చిన్న పూలతోటలోకి వెళ్ళాడు. ఆ తోట లోని ప్రతి మొక్కా, ప్రతి పువ్వూ సాదరంగా ఆహ్వానించాయి. ఆప్యాయంగా స్పృశించాయి. పూలని చేతితో తాకుతూ ముద్దు పెట్టుకుని పరవశించిపోయారు.

*** *** ***

విశాఖ పట్నానికి ఇరవై కిలోమీటర్ల దూరంలో వున్న చిన్న పల్లెటూరు ఆనందరావు మాస్టారిది. అప్పట్లో డిగ్రీ పూర్తి చేసి రైల్వేలో స్టేషను మాస్టారిగా చేరిపోయారు. పెళ్ళి చేసుకున్నాక పిల్లి పిల్లల్ని పట్టుకుని తిరిగినట్టు చాలా స్టేషన్లు మారారు. పెళ్ళయిన పదేళ్ళ వరకూ ఆయనకు సంతానం కలగలేదు. ఆ తరువాత నాన్-స్టా ప్‌లా వరుసగా నలుగురు భూమ్మీద పడ్డారు. ఇద్దరు మగ పిల్లలు,ఇద్దరు ఆడపిల్లలు. పిల్లలు పెద్దవాళ్ళవుతుంటే తను వుంటున్న రోడ్‌సైడ్ స్టేషన్లో చదువులు సక్రమంగా సాగవని విశాఖప ట్నంలో ఇల్లు అద్దెకు తీసుకుని భార్యా పిల్లల్ని అక్కడ వుంచాడు. మొదట్లో వారానికొకసారి రెస్టు రోజున విశాఖ వెళ్ళి వస్తుండేవాడు. రాను రాను నెలకొకసారి ఫస్టు తారీఖున జీతం తీసు కుని వెళ్ళేవాడు. అప్పటి నుంచి స్వయంపాకానికీ, ఒంటరి జీవితానికీ అలవాటు పడిపోయాడు. ఒక్కొక్కప్పుడు ఒంటరి జీవితం దుర్భరమనిపిం చినా పిల్లల కోసం, వాళ్ళ బంగారు భవిష్యత్తు కోసం ఆమాత్రం త్యాగం చేయడం తండ్రిగా తన బాధ్యత అని సరిపెట్టుకునేవాడు. ఆ తరు వాత కొన్నాళ్ళకు లోను పెట్టి గాజువాకలో మంచి ఇల్లు కట్టుకున్నాడు.

*** *** ***

ఆనందరావు మాస్టారు రిటైరై సరిగ్గా నెల రోజులు కావొస్తోంది. పెద్దబ్బాయికి విశాఖ లోనే ఆంధ్రా బ్యాంకులో ఉద్యోగం వచ్చింది. రెండోవాడు బి.కామ్. మొదటి సంవత్సరం చదువుతున్నాడు. పెద్దమ్మాయి బి.ఎ. పూర్తి చేసి ఇంట్లోనే వుంటోంది. సంబంధాలు వస్తున్నాయి గాని ఏదో ఒక్కటీ కుదరటం లేదు. అబ్బాయి నచ్చితే అమ్మాయి నచ్చటం లేదు. అమ్మాయి నచ్ఛఇతే అబ్బాయి నచ్చటం లేదు. అబ్బాయీ, అమ్మాయీ ఇద్దరూ నచ్చితే కట్నకానుకల దగ్గర పేచీలొచ్చి ఆగిపోతు న్నాయి. రెండో అమ్మాయి ఈ ఏడాదే టెన్త్ క్లాస్‌కు వచ్చింది.

సర్వీసులో వుండగానే ఆడపిల్లల పెళ్ళిళ్ళు జరిగిపోతే రిటైర్ అయ్యాక ఆ వ్యక్తికి టెన్షన్ తగ్గుతుంది. వచ్చిన సొమ్ము బ్యాంకులో వేసు కుని హాయిగా కాలం గడపవచ్చు. రిటైర్ అయ్యాక కొంతమంది మళ్ళీ ఉద్యోగాన్వేషణలో పడతారు. ఇది సుతారమూ ఆనందరావు మాస్టారికి నచ్చదు. శేష జీవితాన్ని ఆధ్యా త్మిక చింతనతో, పిల్లా పాపలతో ఆడుతూ పాడుతూ గడపాలన్నది ఆయన అభిమతం.

తెల్లవారి లేచి కాఫీ తాగి అలా మార్కెట్టు వరకూ నడిచి కూరగాయలు తెస్తుంటాడు. వీధి వరండాలో ఈజీ ఛైరు వేసుకుని కొంచెంత సేపు పేపరు చూస్తాడు. స్నానం చేసి, భోజనం ముగించి చిన్న కునుకు తీస్తాడు. సాయం కాలం నడుచుకుంటూ వెళ్ళి శివాలయంలో కూర్చుని నిశ్చలంగా దైవధ్యానం చేసుకుని రాత్రి ఏడు గంటలకు ఇంటికి చేరుకుంటాడు. ఇదీ ఇప్పుడు ఆయన దినచర్య.

ఇంతకు ముందు తను సర్వీసులో వున్న

## మనసున్న మహిమ

జగపతి బాబు, శ్రీకాంత్, మహిమా చౌదరి నటిస్తున్న 'మనసులో మాట' సినిమాని దర్శ కుడు ఎస్.వి.కృష్ణారెడ్డి చాలా జాగ్రత్తగానూ, వెరైటీ గానూ తీశాడట. ముఖ్యంగా మహిమా చౌదరి కో- ఆపరేషన్, వర్క్ పట్ల డెడికేషన్ చాలా తక్కువమంది హీరోయిన్లలో చూశానని కితాబులు కూడా ఇస్తున్నాడు. మొత్తానికి ఒళ్లు దాచుకోకుండా పనిచేస్తుందన్నమాట.



వ్వడు నెలకొకసారి వచ్చి వెళ్ళినప్పుడు, కుటుంబ సభ్యులు చూపే ఆప్యాయతా, ఆదరణకు – ఇప్పుడు వాళ్ళ చేతల్లో కనబరుస్తున్న ఆదరణకు వున్న తేడా ఆయన దృష్టిని దాటిపోలేదు.

ఒకరోజు...దాహం అని మంచినీళ్ళు తెమ్మని పెద్దమ్మాయిని కేకవేశారు.

"ఒసే శాంతీ! నాన్నగారు మంచినీళ్ళు అదుగుతున్నారు. తీసుకెళ్ళి ఇవ్వు!" అని ఆమె చెల్లెలికి పురమాయించింది.

"నాకు తీరిక లేదు. నోట్సు రాస్తున్నాను. నువ్వే తీసుకెళ్ళి ఇవ్వు!" చెల్లెలి జవాబు. ఆ తరువాత అరగంటకు భార్య మంచినీళ్ళు తెచ్చి ఇచ్చింది.

మరో రోజు..రాత్రి..సమయం ఎనిమిది గంటలు. చిన్నకొడుకు ఎక్కడో తిరిగి వస్తుంటే ఆయన కొడుకుని నిలదీశారు.

"ఇంతవరకూ ఎక్కడ తిరుగుతున్నావురా? చదువుకునే టైములో ఈ తిరుగుళ్ళేమిటి?" కసిరినట్టుగానే అడిగారు.

"నేనేమీ తిరగట్లేదు. మా ఫ్రెండు ఇంటికి వెళ్ళి వస్తున్నాను" కాస్త నిర్లక్ష్యంగానే జవాబు చెప్పి ఇంట్లోకి వెళ్ళిపోయాడు వాడు. నిర్ఘాంతపోయాడు ఆనందరావు. ఆయన జీవితంలో మొట్టమొదటిసారి తగిలిన శరాఘాతం. తను సర్వీసులో వున్నప్పుడు తన మాటకు తిరుగు లేదు. ఎదురు చెప్పినవారే లేరు! దీనికి కారణం ఎవరు? తనే. ముమ్మాటికీ తనే. తానొక దగ్గర, పిల్లలొక దగ్గరా వుండటం ఈ వైపరీత్యానికి కారణం. వాళ్ళ భవిష్యత్తు కోసమని చెప్పి వాళ్ళని విశాఖలో వుంచి, తాను ఒంటరిగా వుండి పెద్ద త్యాగం చేశానని భావించి పొరబడ్డాడు. ఇప్పుడు బాధపడితే లాభం ఏముంది?




ఆరోజు రాత్రి ఈ విషయాన్నే భార్యతో ప్రస్తావిస్తే–

"పోనిద్దురూ! వాళ్ళు పిల్లలు. వాళ్ళ మాటల్ని పట్టించుకుంటారెందుకు? లేనిపోని ఆలోచనలతో అనవసరంగా బి.పి. పెంచుకోకండి! పడుకోండి!" అని తేలిగ్గా తీసిపారేసింది భార్యామణి. అవును! ఈమె కూడా వాళ్ళతోనే కదా ఇన్నాళ్ళూ సహవాసం చేసింది! ఎందుకో అంతరాంతరాల్లో 'ఒంటరివాణ్ణి' అన్న ఫీలింగ్ మొట్టమొదటి సారిగా ఆయనలో చోటుచేసుకుంది.

ఒకరోజు రాత్రి పది గంటలకు ఆనందరావు మాస్టారు బాత్‌రూమ్‌కు వెడుతుంటే ప్రక్క గదిలోంచి చిన్నగా మాటలు వినిపిస్తున్నాయి. అప్రయత్నంగా ఆగిపోయారు.

"వయసు పెరుగుతున్న కొద్దీ నాన్నగారికి చాదస్తం ఎక్కువవుతోంది మమ్మీ! అదీగాక పనీపాట లేకుండా తీరిగ్గా కూర్చోవడం కూడా ఆయన ఆరోగ్యానికి అంత మంచిది కాదు" పెద్ద కొడుకు తల్లితో చెబుతున్నాడు.

"ఒంటరి జీవితానికి కొన్నాళ్ళుగా అలవాటు పడిపోయారు. ఇంట్లో నలుగురితో కలసి మెలసి తిరగటం ఆయనకు చికాకు అనిపిస్తుంది. కొన్నాళ్ళకు ఆయనే సర్దుకుంటార్లు లేరా!" కొడుక్కి నచ్చచెవుతోంది తల్లి.

"అది కాదు మమ్మీ నేననేది! మా బ్యాంకు కస్టమర్ నాకు తెలిసిన ఒకాయన వున్నాడు. పెద్ద కంట్రాక్టర్. చిన్న మాటల సందర్భంలో అన్నాడు తనకు అకౌంట్స్ లావాదేవీలు చూట్టానికి ఒక మనిషి కావాలని చెప్పాడు. తెలిసిన వాళ్ళెవరైనా వుంటే చూడమన్నాడు. నువ్వు నాన్నగారితో చెప్పి ఒప్పిస్తే ఏదో వేన్నీళ్ళకు చన్నీళ్ళలా వుంటుంది. అదీగాక ఆయనకు కాలక్షేపంగానూ వుంటుంది. ఏమంటావ్?" అడిగాడు తల్లిని.

"బాగానే వుంది. నెల నెలా జీతం తెచ్చే రోజుల్లోనే ఈ ఇంటి ఖర్చులను తట్టుకోవడం కష్టంగా వుండేది. ఇక రిటైరయ్యాక ఆ వచ్చే గొర్రెతోక పెన్షను ఈ కరవు రోజుల్లో ఏ మూలకి సరిపోతుంది? ఏదో దేవుని దయ వల్ల ఆయన రిటైరయ్యేసరికి నీకీ ఉద్యోగం దొరకడం, అదీగాక ఈ ఊళ్ళోనే దొరకడం మన అదృష్టం కాకపోతే మరేమిటి! ఎదిగొచ్చిన ఇద్దరాడపిల్లలు పెళ్ళీ పెటాకులు లేకుండా గజ్జెల గుర్రాల్లా నట్టింట తిరుగాడుతుంటే కనీసం ఆయనకు చీమ కుట్టినట్టయినా లేదు. ఈరోజే ఆయన్నడిగి ఏదో ఒకటి తేల్చి పారేస్తాను" తల్లి కొడుకుతో చెబుతోంది.

మరి అక్కడ నిలబడ బుద్ధి కాలేదు ఆనందరావుకు. అచేతనంగా తన గదిలోకి వచ్చేశాడు. లైటార్పేసి పడుకున్నాడు గాని నిద్ర పట్టడం లేదు. తెరలు తెరలుగా వస్తున్న భావ తరంగాలు హృదయాంతరాళాల్ని కడ వరకూ తాకి ఉక్కిరి బిక్కిరి చేస్తున్నాయి.

'ఇదేనా నేను నిర్మించుకున్న సుందర భవనం! ఇదేనా నేను కలలుగన్న అందాల బృందావనం! కొవ్వొత్తిలా కరిగిపోతూ, అనుభవించే వయసులో సర్వ సుఖాలను త్యజించి పిల్లల భవిష్యత్తుకు బంగరు బాట వేశానని మురిసిపోయానే! ఇదేనా తను ఆశించిన నందనవనం! భార్యా బిడ్డల దృష్టిలో నేనొక పని చేసే యంత్రాన్ని! ఈ యంత్రానికి విశ్రాంతి లేదు. విరామం లేదు. అలా నిరంతరం గిర గిర తిరగవలసిందే! తిరిగి, తిరిగి, అరిగి, అరిగి, అలసి సొలసి ఆగిపోతే మరి పనికి రానని అవతల పారేస్తారు. అంతే! అలా ఆలోచిస్తూ చాలా సేపటికి మగతగా నిద్రలోకి జారుకున్నారు.

*** *** ***

ఆనందరావు మాస్టారు మళ్ళీ ఉద్యోగంలో జాయినయ్యారు. భార్యా పిల్లలు వీధి గుమ్మం వరకూ వచ్చి ఆనందంగా సాగనంపారు. పెద్ద కొడుకు ముందు నడుస్తుంటే అమ్మవారికి బలివ్వడానికి తీసుకెడుతున్న మేకపిల్లలా తల వంచుకుని వెనుక నడుస్తున్నారు. వెడుతూ, వెడుతూ వీధి మలుపు తిరిగినప్పుడు భార్యా బిడ్డలకేసి తలెత్తి ఒకసారి వెనక్కి చూశారు. ఆ చూపులోని భావాలు చదవడానికి వర్తమాన సమాజంలో డబ్బుతో ముడిపడి వున్న జీవితాలతో సతమతమవుతోన్న ఆ సామాన్య సగటు మానవులకి అంత తీరికెక్కడిది?